క్లుప్తంగా

విద్యకు అధిక ప్రాధాన్యం



కోటనందూరులో విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు గర్సింగు దొరబాబు అన్నారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రాగి జావ తాగేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టీల్ గ్లాసులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న గోరుముద్ద పథకంలో వారికి మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. తాజాగా మెనూలో రాగిజావను చేర్చి మరింత బలోపేతం చేశారన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర, పీఎంసీ చైర్మన్లు ఉల్లూరి శ్రీను, నంబూరి కిరణ్‌కుమార్, వార్డు మెంబర్ మళ్ల సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాక్సినేషన్

జగ్గంపేట: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో పిచ్చి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కుక్కలకు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఎంపీడీఓ హరికృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. వేసవి సందర్భంగా మూగజీవాలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి చేతి పంపులు పనిచేయకపోతే వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ భారతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కిర్లంపూడి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఏఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని తామరాడ, గోనేడ, రామచంద్రపురం, పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్ కో డీఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. ఇర్రిపాక సబ్‌స్టేషన్ పరిధిలోని మామిడాడ, ఇర్రిపాక, నరేంద్రపట్నం గ్రామాలకు, జగ్గంపేట ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని పరిశ్రమలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రుణాలకు అదనపు చార్జీలు వేయవద్దని వినతి



తునిలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తుని: ఉద్యోగులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు చెల్లింపుల్లో అదనపు చార్జీలు వేయవద్దని మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం బ్యాంకు మేనేజర్లకు వినతిపత్రం సమర్పించారు. అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా వేస్తున్న నేపథ్యంలో ఈఎంఐలు, చెల్లింపులు ఆలస్యం అవుతాయన్నారు. బ్యాంకులు ఈఎంఐల చెల్లింపులో ఆలస్యం కారణంగా అదనపు చార్జీలు వేస్తే సివిల్ స్కోరుపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వం జీతాలు విడుదల చేసే తేదీలకు ఈఎంఐలను మార్పు చేయాలని వినతిపత్రంలో కోరారు. పలువురు మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయండి : ఆర్డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష రీ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీవో బీవీ రమణ అన్నారు. గురువారం డివిజనల్ స్థాయి సమావేశం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించి మాట్లాడుతూ సరిహద్దు సర్వే రాళ్లను వేగంగా పాతాలని, మ్యుటేషన్, భూ మార్పిడి, స్పందన దరఖాస్తులపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పరిపాలనాధికారి వరహాలయ్య, సత్యనారాయణ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

- ఆశాజనకంగా దిగుబడులు
- ఎకరాకు రూ.60 వేలకు పైగా ఆదాయం
- చెరకుకు ప్రత్యామ్నాయంగా సాగు చేస్తున్న రైతులు



ఎస్‌బీ పేటలో చెరకుకు ప్రత్యామ్నాయంగా సాగు చేస్తున్న మొక్కజొన్న

తుని రూరల్: మొక్కజొన్న సాగుతో మెట్ట రైతులు లాభాలు గడిస్తున్నారు. గతంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసే రైతులు ప్రస్తుతం మొక్కజొన్న సాగు వైపు మళ్లారు. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఎకరాకు రూ.60వేలకు పైగా ఆదాయం సమకూరుతుందని రైతులు తెలిపారు. క్రషింగ్‌కు అవసరమైన చెరకు ఉత్పత్తి లేకపోవడంతో తాండవ చక్కెర కర్మాగారంలో 2020–21 నుంచి క్రషింగ్‌ను నిలిపివేశారు. అప్పటికే కొంతమంది పండించిన చెరకు పంట పొలాల్లో ఉండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలా ఉండిపోయిన చెరకును బెల్లం తయారీకి, ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రైవేట్ సుగర్ ఫ్యాక్టరీకి రైతులు దశలవారీగా తక్కువ ధరకు విక్రయించారు.

1033 ఎకరాల్లో మొక్కజొన్న సాగు

నియోజకవర్గంలో రైతులు చెరకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగును చేపట్టారు. ప్రధానంగా సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు, ఎన్.సూరవరం, తదితర గ్రామాల రైతులు మొక్కజొన్న సాగును గతేడాది నుంచి చేస్తున్నారు. ఈ సంవత్సరం మరింత మంది రైతులు సాగు చేపట్టడంతో ప్రైవేట్ కంపెనీలు విత్తనాలు, ఎరువులు ఇచ్చి రైతులను ప్రోత్సహించాయి. ఈ ఏడాది తుని నియోజకవర్గంలో 121 మంది రైతులు 290 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 61 మంది రైతులు 96 ఎకరాలు, జగ్గంపేట నియోజకవర్గంలో 335 మంది రైతులు 647 ఎకరాలు సాగు చేసినట్టు అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో మూడు నియోజకవర్గాల పరిధిలో 517 మంది రైతులు 1033 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు.

ఎకరాకు ఆరు టన్నుల దిగుబడి

ఆరుతడిగా సాగయ్యే మొక్కజొన్నకు మెట్ట భూములు అనుకూలంగా ఉండడంతో ఈ సంవత్సరం మొక్కజొన్న దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు గతేడాది నాలుగు టన్నులు వరకు దిగుబడి వచ్చిందని, ఈ సంవత్సరం ఆరు టన్నులు వరకు దిగుబడి వచ్చినట్టు సుభద్రయ్యమ్మపేట (ఎస్‌బీ.పేట), కొలిమేరు, ఎన్.సూరవరం రైతులు తెలిపారు. గిట్టుబాటు ధరసైతం రూ.11 వేలు, రూ.12 వేలు చెల్లించిన కంపెనీలు ఈ సంవత్సరం మొదటి రకానికి రూ.18 వేలు, రెండో రకానికి రూ.17 వేలు, మూడో రకానికి రూ.16 వేలు చొప్పున చెల్లిస్తున్నట్టు రైతులు తెలిపారు. కోత కూలి, రవాణా చార్జీలు, పెట్టుబడి పోగా ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులు ఆదాయం పొందుతున్నారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న కంకులు

ప్రోత్సహిస్తున్న కంపెనీలు

మొక్కజొన్నను పౌల్ట్రీ ఫీడ్ (కోళ్లఫారాల్లో దాణా)గా వినియోగిస్తారు. దీంతో పలు కంపెనీలు ప్రోత్సాహకంగా విత్తనం, రెండు విడతల్లో వేసే ఎరువులను అందిస్తున్నాయి. రకాన్ని బట్టి గిట్టుబాటు ధరను రూ.16 వేల నుంచి రూ.18 వేలు వరకూ చెల్లించేందుకు ఆయా కంపెనీలు రైతులతో ఒప్పందాలు చేసుకున్నాయి. రానున్న కాలంలోనూ ఇదే పద్ధతి కొనసాగితే మెట్టప్రాంతంలో మొక్కజొన్న సాగు మరింత విస్తరించే అవకాశం ఉంది.

దిగుబడి బాగుంది

సుమారు మూడు దశాబాల పాటు చెరకు సాగు చేశాను. తాండవ సుగర్ ఫ్యాక్టరీ మూసివేయడంతో రెండేళ్లగా మొక్కజొన్న సాగు చేస్తున్నాను. ఈ ఏడాది రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. గతేడాది ఎకరాకు మూడు నుంచి నాలుగు టన్నులు దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం ఆరు టన్నులు వరకు దిగుబడి రావడం సంతోషంగా ఉంది.

– మళ్ల కొండయ్య నాయుడు, రైతు, ఎస్‌బీ పేట

ధర ఆశాజనకం

టన్నుకు రూ.16 వేల చొప్పున గిట్టుబాటు ధర దిగుబడితో పాటు గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉంది. కంపెనీ ఇచ్చిన మూడో రకం విత్తనం వేశాను. 70 సెంట్లలో మొక్కజొన్న సాగు చేయగా నాలుగు టన్నులు దిగుబడి వచ్చింది. ప్రోత్సాహకంగా విత్తనం, రెండు విడతల ఎరువులు ఇచ్చిన కంపెనీ టన్నుకు రూ.16 వేలు చొప్పున గిట్టుబాటు ధర చెల్లిస్తుంది.

– మళ్ల నాగేశ్వరరావు, రైతు, ఎస్‌బీ పేట

క్యారెక్టర్ ఆర్టిస్ట్ గుణశేఖర్‌కు నంది అవార్డు



హైదరాబాద్‌లో బంగారు నంది అవార్డు అందుకున్న గుణశేఖర్

తొండంగి: సినిమా, సీరియల్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్న ఒంటిమామిడి పంచాయతీ తాటియాకులపాలెం గ్రామానికి చెందిన కొమ్మోజు గుణశేఖర్ జాతీయ బంగారు నంది అవార్డు పొందారు. హైదరాబాద్‌లోని హరిహర కళామందిరంలో ఇటీవల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాలకు చెందిన కళాకారులకు జీసీఎస్ సౌజన్యంతో బంగారు నంది అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కొమ్మోజు గుణశేఖర్ సూక్ష్మకళాఖండాలను రూపొందించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు తదితర అవార్డులు సాధించారు. కాగా గుణశేఖర్ ఆర్ఎక్స్ 100, వెంకీ మామ, అలవైకుంఠపురం, ఆచార్య వంటి సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించారు. ఈ నేపథ్యంలో వల్లూరి ఫౌండేషన్ గుణశేఖర్‌కు బంగారు నంది అవార్డును ప్రదానం చేసింది. అవార్డు పొందిన గుణశేఖర్‌ను ఏపీ తెలుగు భాషా సాంస్కృతిక అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి అభినందించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- జగ్గంపేట గడపగడపకూ మన ప్రభుత్వం

జగ్గంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట శివారు యానాదుల కాలనీలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు తదితర సమస్యలు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీలో రూ.5 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాలనీలోని ఎస్టీ హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ నూతన భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు వార్డెన్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఎమ్మెల్యే వార్డెన్లకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జ్యోతుల రామస్వామి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, పార్టీ నాయకులు వత్సవాయి సూర్యనారాయణరాజు, బోదా శివకుమార్, రామన్నదొర తదతరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు



తాళ్లూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తాళ్లూరులో జగనన్నే మా భవిష్యత్

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తాళ్లూరులో గురువారం ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం తాళ్లూరు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. జగనన్న కాలనీల్లో రక్షిత నీరు, విద్యుత్, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అన్ని వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. తొలుత గ్రామ దేవత డెక్కల పోలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమల్లో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, పాలచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గోనేడలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: గ్రామంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

ఇంటింటికీ జగనన్నే మా భవిష్యత్

కిర్లంపూడి: మండలంలోని గోనడలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అల్లు విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు పేపకాయల గంగాధర్, మోటేపల్లి లక్ష్మీగణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు.

నేడు మండల సమావేశం

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ గురువారం తెలిపారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన జరిగే సమావేశంలో మండల ప్రగతి, లక్ష్యాలపై చర్చిస్తారన్నారు. ఇప్పటికే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్యం



గోకవరంలో వృద్ధుడికి ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తిరస్

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని డాక్టర్ తిరస్ అన్నారు. గోకవరం సచివాలయం–3 పరిధిలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహన వైద్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ లక్ష్మీకాంతం, వైద్య సిబ్బంది రమ్య, రమణ, శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రత్తిపాడు: ప్రస్తుత వేసవిలో ప్రజలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు రఘురామ్ ఆసుపత్రి అధినేతలు ఇందన రఘురామ్, శారదాదేవి సూచించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో గురువారం సాయంత్రం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. వంటింట్లో, ఆరుబయట అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఇరుగు పొరుగు వారిని సైతం అప్రమత్తం చేయాలని వైద్యులు రఘురామ్, శారదాదేవి సూచించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజీ రత్నంరాజు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫైర్ విన్యాసాలు

స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం గ్యాస్ స్టౌవ్, ఇతర ప్రమాదాలపై ప్రయాణికులకు స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ ప్రమాదాలు, ఎత్తయిన ప్రదేశాల్లో సంభవించే అగ్ని ప్రమాదాలు, పెట్రోల్, డీజిల్ తదితర వాటి వల్ల ఉత్పన్నమయ్యే ప్రమాదాలను ఎదుర్కోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పద్ధతులపై లీడింగ్ ఫైర్‌మెన్‌లు కేఎస్ఎన్ మూర్తి, పి.సత్యనారాయణ మాక్ డ్రిల్ చేపట్టారు. ఫైర్‌మెన్లు బి.లత్సారావు, వీరబాబు, సతీష్‌బాబు, డీఓపీలు వేణు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు

రత్నగిరిపై అమ్మవార్లకు హోమాలు

అన్నవరం: చైత్ర అమావాస్యను పురస్కరించుకుని గురువారం రత్నగిరిపై దుర్గామాతలు కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లకు ఘనంగా హోమాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు కనకదుర్గ అమ్మవారికి చండీహోమం, వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. కాగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కనకదుర్గ అమ్మవారి చైత్రమాస ఉత్సవాలు చండీహోమంతో ముగిశాయి. వేదపండితులు సంతోష్ ఘనపాఠి, ఇంద్రగంటి నర్సింహమూర్తి, ముత్య సత్యనారాయణ, పాలంకి పట్టాభి, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమాలు జరిపారు. ఆలయ ఏఈఓ కృష్ణారావు, సూపరింటిండెంట్లు రమణ, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు హోమం నిర్వహిరని చెప్పారు. ఆసక్తి గల భక్తులు రూ.750తో టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొనాలని సూచించారు.



రత్నగిరిపై కనకదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

గండేపల్లి: చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు అక్రమార్కులు చేసిన ప్రయత్నాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని నీలాద్రిరావుపేట పంచాయతీకి చెందిన పెద జగమ్మ చెరువు జగ్గంపేటలోని గోకవరం రోడ్డుకు సమీపంలో ఉండగా నెహ్రూ కాలనీకి ఎదురుగా ఉన్న వీధిలో చెరువుకు వెళ్లే మార్గం ఉంది. ఈ మార్గాన్ని ఆనుకుని ఉన్న చెరువును ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. చెరువు స్థలంలో ముళ్ల కంపలు, తాటి వాసాలతో దడి కట్టారు. విషయాన్ని గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, స్థానిక నాయకులు తహసీల్దార్ చిన్నారావు దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ వీఆర్వో దిలీప్‌ను సంఘటన స్థలానికి పంపించడంతో ఆక్రమణను అడ్డుకుని, కట్టిన దడిని తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

హెల్మెట్ తీసి.. ప్రాణాలు విడిచి..

అన్నవరం: ఆమె ఉపాధ్యాయురాలు. అంతకు మించి స్వచ్ఛంద సేవకురాలు. అప్పటివరకూ హెల్మెట్ ధరించిన ఆమె రోడ్డు దాటడమే కదా హెల్మెట్ ఎందుకు అనుకున్నారు. ఆ ఒక్క పొరబాటుతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక బీసీ కాలనీలో అనపర్తి కనకదుర్గా అఖిల (31) ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె సంకల్పం అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత శనివారం పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్‌గా కత్తిపూడి స్కూల్‌లో విధి నిర్వహణకు వెళ్లారు. పరీక్షల అనంతరం ఆమె మరో ఉపాధ్యాయురాలితో కలిసి భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్లేందుకు గాను స్కూటీ మీద రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొంది. ఆ సమయంలో అఖిల హెల్మెట్ ధరించలేదు. వెనుక ఉన్న మరో ఉపాధ్యాయురాలు హెల్మెట్ ధరించడంతో ఆమెకు స్వల్పగాయాలవ్వగా అఖిల తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అఖిలకు భర్త వాసు, కుమారుడు ఉన్నారు.

మృతదేహం పాయకరావుపేటకు తరలింపు

స్థానిక సంకల్పం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక సభ్యురాలైన అఖిల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆ సంస్థ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సంకల్పం సంస్థ సభ్యులందరూ హెల్మెట్లు ధరించి మృతదేహాన్ని ఆమె స్వస్థలం పాయకరావు పేటకు తరలించారు.



ఊరేగింపుగా అఖిల మృతదేహాన్ని పాయకరావుపేట తరలిస్తున్న సంకల్పం సభ్యులు



మృతురాలు అఖిల (ఫైల్)

ముగిసిన తలుపులమ్మ జాతర మహోత్సవాలు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 9న అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం కాగా బుధవారం రాత్రి జాగరణ నిర్వహించారు. గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు, తీర్థం నిర్వహించారు. వివిధ దేవతా మూర్తుల వేషధారణలు, కళాకారులు బళ్లవేషాలు, భీమవరం వారితో సంగీత విభావరి, నక్కపల్లి వారితో మ్యూజికల్ బ్యాండ్ ప్రదర్శించారు. గంధామావాస్య పర్వదినాలను పురష్కరించుకుని 12 రోజులు పాటు అమ్మవారి జాతరోత్సవాలు ఘనంగా నిర్వహించామని చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ధర్మకర్తలు, లోవకొత్తూరు గ్రామస్తులు, రూరల్ పోలీసులు సహకరించారన్నారు. జాతరోత్సవాలు ముగియడంతో అమ్మవారి గరగలను గ్రామంలోని రామాలయంలో భద్రపర్చారు.



లోవకొత్తూరులో కొలువైన తలుపులమ్మ తల్లి



బళ్ల వేషాలను ప్రారంభిస్తున్న చైర్మన్, ఈఓలు

వైభవంగా నల్లకొండమ్మతల్లి జాతర

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో నల్లకొండమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కలు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చిల్లంగిలో గుబ్బాలమ్మ జాతర

కిర్లంపూడి: చిల్లంగిలో గుబ్బాలమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా రూపులమ్మ అమ్మవారి జాతర

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే స్థానిక రూపులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. జాతరలో గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టణంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా శుక్రవారం అమ్మవారి తీర్థమహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఏలేశ్వరం రూపులమ్మ జాతరలో గరగనృత్యాలు

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై యువి శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... వీరలంకపల్లిలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో వెదురుపాకకు చెందిన పప్పల పద్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు.